సాక్షి మంచిర్యాల

ఆదివారం । 26 । నవంబర్ । 2023



క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

ఎన్‌సీసీ విద్యార్థులను మెరికల్లా తయారు చేస్తోంది. కర్తవ్యం, నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో వారిలో సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తోంది. నేడు ఎన్‌సీసీ దినోత్సవం. 6లో▸



గూడెంలో కొనసాగుతున్న రద్దీ

గూడెంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మరోవైపు సోమవారం జరిగే కార్తీక జాతరకు ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. 6లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0 /22.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రివేళ చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

తనిఖీ కేంద్రాల సందర్శన



చెక్‌పోస్టు వద్ద తనిఖీల తీరు పరిశీలన

దండేపల్లి: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మండలంలోని గూడెం, తాళ్లపేటలో ఏర్పాటు చేసిన ఎన్నికల తనిఖీ కేంద్రాలను జిల్లా ఎన్నికల ఖర్చుల నిర్వహణ, పరిశీలన అధికారి హన్మంతరెడ్డి శనివారం సందర్శించారు. వాహనాల తనిఖీ తీరు, రిజిష్టర్లు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఎన్నికల్లో ఓపీఓల పాత్ర కీలకం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

చెన్నూర్: ఎన్నికల్లో ఓపీవో(అదర్ పోలింగ్ ఆఫీసర్)ల పాత్ర కీలకమని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఓపీఓల శిక్షణ తరగుతలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిక్షణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓపీఓలు ఎడమ చేతికి ఇండబుల్ సిరా పెట్టడంలో, బ్యాలెట్ విడుదల చేయడంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని విభాగాల పోలింగ్ అధికారులు సమన్వయంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్వో సిడాం దత్తు, తహసీల్దార్లు చంద్రశేఖర్, మల్లికార్జున్, విశ్వంభర్, మాస్టర్ ట్రైనర్స్ గుండెటి యోగేశ్వర్, శ్రీమూర్తి, కృష్ణమూర్తి, షారీక్, లక్ష్మీనారాయణ, దత్తమూర్తి, సురేందర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



వెంకటపూర్‌లో పోలింగ్ కేంద్రం తనిఖీ

కాసిపేట: మండలంలోని మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను బెల్లంపల్లి నియోజకవర్గ పోలీస్ అబ్జర్వర్ ఇలాంగో శనివారం పరిశీలించారు. దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మరావుపేట, రొట్టెపల్లి, వెంకటపూర్, సోనాపూర్, గట్రావుపల్లి, కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోమటిచేను పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. నిత్యం నిఘా ఉంచుతూ పరిసర ప్రాంతాల్లో బందోబస్తులు, తనిఖీలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, దేవాపూర్, కాసిపేట ఎస్సైలు ఆంజనేయులు, గంగారాం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాల్లో భాగస్వాములు కావాలి



శిక్షణ ఇస్తున్న జడ్జి అసదుల్లా షరీఫ్

లక్సెట్టిపేట: మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు వంద సంవత్సరాల శతాబ్ది ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన న్యాయవాదుల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. శతాబ్ది ఉత్సవాల్లో నిర్వహించే కార్యక్రమాల ఎజెండాను త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. శిక్షణ తరగతులను న్యాయవాదులు విజయవంతం చేయాలని తెలిపారు. న్యాయవాదులు నళినికాంత్, తాజోద్దీన్ పలు కేసులపై వివరించారు. బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బీసీ జనగణనకు ఆదేశాలు జారీ చేయాలి

పాతమంచిర్యాల: బీసీ జనగణనకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని బీసీ ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ తరహాలోనే బీసీ జనగణనకు ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, నాయకులు కనుకుట్ల మల్లయ్య, చంద్రమౌళి, విశ్వం, రంగు రాజేశం, కోటిలింగం, సోమన్న తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

ఆరు గ్యారంటీలపై.. తొలి సంతకం



కాంగ్రెస్ సభకు హాజరైన జనం



అభివాదం చేస్తున్న రాహుల్ గాంధీ

- బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే
- ఆ రెండు పార్టీలను ఓడించాలి
- రాహుల్ గాంధీ పిలుపు
- పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచిన ఏఐసీసీ అగ్రనేత
- ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ విజయభేరి సభ సక్సెస్

సాక్షి,ఆదిలాబాద్: 'బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే.. ఈ రెండు పార్టీలకు మూడో దోస్తు ఎంఐఎం.. ఈ ఎన్నికల్లో ఆ పార్టీలను ఓడించాలని..' కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీల స్కీంలపైనే తొలిసంతకం పెట్టడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్‌లో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభకు ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి ఎందుకు తీసుకురావాలో వివరించారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రధానంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలోని బీజేపీ సర్కారు తీరుపై తీవ్రస్థాయిలో విమర్శించారు. ఏ ఆశయాలతో తెలంగాణ ఏర్పడిందో ఆ స్వప్నాన్ని నాశనం చేశారంటూ బీఆర్ఎస్‌పై ధ్వజమెత్తారు. దొరల తెలంగాణను పారదోలి ప్రజల తెలంగాణను ఏర్పాటు చేసుకుందామని పిలుపునిచ్చారు. అలాగే కేంద్రంలోని మోదీప్రభుత్వం సైతం ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రజల ఆశయాలను కాంగ్రెస్ నెరవేరుస్తుందని భరోసా ఇచ్చారు. పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం రాహుల్‌ను పలువురు సన్మానించారు.

భారీగా జన సమీకరణ..

ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో కాంగ్రెస్ విజయభేరి సభ శనివారం నిర్వహించారు. మధ్యాహ్నం 1.40 గంటల సమయంలో రాహుల్ గాంధీ ఆదిలాబాద్ చేరుకున్నారు. నియోజకవర్గం నుంచి భారీగా జనంతరలివచ్చారు. హెలీప్యాడ్ నుంచి నేరుగా బహిరంగ సభస్థలికి వాహనంలో చేరుకున్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు ఎమ్మెల్సీ రాథోడ్ ప్రకాశ్, ఆదిలా బాద్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి, బోథ్ అభ్యర్థి ఆడె గజేందర్, సీనియర్ నేతలు గోవర్ధన్‌రెడ్డి, నరేశ్ జాదవ్, భరత్‌వాఘ్మారే, సైద్‌కాన్, శ్రీధర్ భూపెల్లి, సంతోశ్‌రావు, రూపేశ్‌రెడ్డి, జెడ్పీటీసీ గణేశ్ రెడ్డి, ఎస్టీ సెల్ పార్లమెంట్ కార్యదర్శి శాంతకుమారి, డేర కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సుమారు గంటపాటు సభలో ఉన్న రాహుల్ ప్రసంగం తర్వాత బయల్దేరి వెళ్లారు.

మహిళ, చిన్నారిని వేదికపైకి పిలిచి..

రాహుల్ తన ప్రసంగం మధ్యలో ఆరు గ్యారంటీల స్కీంలపై ప్రస్తావిస్తూ సభలో ఉన్న ఓ మహిళ, చిన్నారిని వేదికపైకి రావాలనిఆహ్వానించారు. ఆ చిన్నారితో కార్డులోని ఆరు గ్యారంటీ స్కీంలను చదివిస్తూ వాటి అమలు ద్వారా తెలంగాణ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. గృహజ్యోతి, రైతు భరోసా, చేయూత, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, యువవికాసం పథకాల ప్రాధాన్యతను వివరించారు. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం ఈ పథకాలను తీసుకొస్తున్నామన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి తొలిసంతకం దీనిపైనే ఉంటుందని వివరించారు. రాహుల్ సభ సక్సెస్‌తో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది.



ఆరు గ్యారంటీ పథకాలను చిన్నారి చెబుతుండడంతో ఆసక్తిగా వింటున్న రాహుల్

బీజేపీ శ్రేణుల్లో జోష్



వేదికపై యూపీ సీఎం యోగి, బీజేపీ అభ్యర్థులు హరీశ్‌బాబు, ఆత్మారాంనాయక్, తదితరులు

- రామరాజ్య స్థాపన సంకల్ప సభకు తరలివచ్చిన జనం
- కిక్కిరిసిన కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం క్రీడామైదానం
- రాష్ట్రంలో తొలి ప్రచారసభలో పాల్గొన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్
- ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు

కాగజ్‌నగర్‌టౌన్/కాగజ్‌నగర్‌రూరల్/చింతలమానెపల్లి: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలో శనివారం నిర్వహించిన రామరాజ్య స్థాపన సంకల్ప సభ బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఆశించిన స్థాయిలో జనం తరలిరావడంతో కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు (ఎస్పీఎం) క్రీడామైదానం కిక్కిరిసిపోయింది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి, బీజేపీ ఫైర్ బ్రాండ్ యోగి ఆదిత్యనాథ్ తెలంగాణ రాష్ట్రంలో పాల్గొన్న తొలి ప్రచార సభకు పార్టీ శ్రేణులతోపాటు బెంగాలీ క్యాంపుల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం 1.20 గంటలకు హెలికాప్టర్‌లో ఆయన ఎస్పీఎం మైదానానికి చేరుకున్నారు. సభ ప్రాంగణం పక్కనే ఏర్పాటు చేసిన స్టేజీపై కళాకారులు ఆటపాటలతో హోరెత్తించారు. హర్‌ఘర్ మోదీ... యోగి.. మోదీ.. జైశ్రీరాం బోలేగా... అనే పాటలకు సభికులు స్టెప్పులు వేస్తూ కనిపించారు. ఉదయం పొగమంచు, చలితో ఉన్న వాతావరణం 10 గంటల తర్వాత ఒక్కసారిగా మారింది. ఎండవేడి పెరగడంతో ప్రజలు కొంత ఇబ్బంది పడ్డారు. ప్రసంగాలు త్వరగా ముగించాలని సభాధ్యక్షుడు కోరడంతో వక్తలు తక్కువ సమయమే మాట్లాడారు. సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబుకు మీ ఓటు వేసి సహకారం అందించాలని యోగి తెలుగులో కోరారు. నిధులు, నీళ్లు, నియామకాలు అంటూ తెలుగులో చదివి.. వాటిని అమలు చేయకపోవడంపై హిందీలో విమర్శలు చేయడం ఆకట్టుకుంది. ప్రసంగం మొత్తం హిందీలోనే సాగినా ప్రజలను ఆకట్టుకునేందుకు అప్పుడప్పుడు తెలుగులోనే మాట్లాడారు. స్థానిక నేతలను ప్రస్తావించకుండా పార్టీ పేర్లు ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. చివరగా అయోధ్యలో రామాలయం ప్రారంభిస్తున్నామని, మీరందరూ రావాలని సభికులను ఆహ్వానించి ప్రసంగాన్ని ముగించారు. ఎస్పీ కె.సురేశ్‌కుమార్, కాగజ్‌నగర్ డీఎస్పీ ఎ.కరుణాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్ వద్దకు వెళ్లే సమయంలో పాల్వాయి హరీశ్‌బాబు స్థానిక నేతలను యోగి ఆదిత్యనాథ్‌కు పరిచయం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, వణి, చిమూర్ ఎమ్మెల్యేలు సంజీవ్‌రెడ్డి, బంటి భాంగడియా, మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మితో పాటు స్థానిక, జిల్లా నేతలు పాల్గొన్నారు.

'ప్రాణహిత' పూర్తి చేస్తాం

- పోడు భూముల సమస్యలు పరిష్కరిస్తాం
- బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి
- సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు



సభలో మాట్లాడుతున్న పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: బీజేపీని గెలిపిస్తే ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని, తద్వారా ఈ ప్రాంతంలో 50 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించి సస్యశ్యామలం చేసే అవకాశం ఉందని ఆపార్టీ సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు పేర్కొన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో 100 గ్రామాలకు రవాణా సౌకర్యం లేదని, అటవీ శాఖ అనుమతుల పేరుతో రోడ్లు నిర్మించలేదని ఆరోపించారు. బీజేపీకి అవకాశం ఇస్తే 100 గ్రామాలకు రోడ్లు వేస్తామని, ఎస్పీఎంలో నాలుగు వేల మంది స్థానికులకు ఉపాధి కల్పిస్తానని భరోసా ఇచ్చారు. కాగజ్‌నగర్‌లో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. పోడు భూముల విషయంలో రైతులకు అన్యాయం జరిగిందని, తాను కూడా 40 రోజుల జైలుజీవితం గడిపినట్లు గుర్తు చేశారు. కేంద్రంతో మాట్లాడి పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా కృషి చేస్తానన్నారు. ఈజ్‌గాంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పాలనలో తాలుకా ఆగమైందని, ప్రజలు గంపగుత్తగా బీజేపీకి ఓటు వేసి తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు.

ఓట్ల ఎత్తిపోతలలో కాళేశ్వరం!

- ఈ ఎన్నికల్లో ఇదే ప్రచారాస్త్రం
- నాలుగేళ్లుగా ముంచుతున్న బ్యాక్‌వాటర్
- ప్రభుత్వంపై రైతాంగం వ్యతిరేకత
- 'చెన్నూరు'లో ముంపు బాధిత ఓటర్ల ప్రభావం



కోటపల్లి మండలంలో ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో దెబ్బతిన్న పత్తి చేను(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'కాళేశ్వరం' సాగునీటి ప్రాజెక్టు ముంపు ప్రాంత రైతుల నిర్ణయం ఈ ఎన్నికల్లో ఓట్ల 'ఎత్తిపోత'లకు కీలకంగా మారింది. జిల్లాలో అధికంగా చెన్నూర్ నియోజకవర్గంలో వందలాది మంది రైతుల పంట ఏటా నీట మునుగుతోంది. యేటా సాగులో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా చితికిపోయి ఇబ్బందులు పడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ప్రతీ వర్షాకాలంలోనూ గోదావరి నది తీర పంటలు నీట మునిగి రూ.కోట్ల పెట్టుబడి వరదపాలవుతోంది. పలుమార్లు రైతులు నిరసనలు, ధర్నాలు చేసినా, రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేక తీవ్ర నష్టాలపాలు అవుతూనే ఉన్నారు. ఇటీవల ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు చెన్నూరు పట్టణ పర్యటనలో ముంపు రైతులకు నష్టపరిహారం కోసం నిరసనలు చేసేందుకు వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. ఎన్నికల ప్రచారం వెళ్తున్న క్రమంలో చెన్నూరు పట్టణంలో రైతులు ఎమ్మెల్యే వచ్చిన సందర్భంలో అసంతృప్తి వ్యక్తపర్చారు. ఏటా పంటలు నీట మునుగుతున్నా రైతులకు కనీసం నష్టపరిహారం ఇవ్వకుండా తప్పించుకుంటున్నారని బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రంగా ఆరోపణలు చేస్తున్నారు. గతంలో చెన్నూరు పట్టణంలో ఓ రైతు నిరాహార దీక్ష చేశారు. జైపూర్, ఇందారంలో తమ పంటలకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు రాస్తారోకోలు చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి పట్టింపు లేకపోవడంతో తాజాగా అసెంబ్లీ ఎన్నికల్లో రైతుల ఓట్లు ఎటు వెళ్తాయనే చర్చ మొదలైంది.

ఏళ్లుగా రైతులకు కష్టాలే..

కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయి అందుబాటులోకి వచ్చినప్పటికీ చెన్నూరు నియోజకవర్గంలోని ప్రాణహిత, గోదావరి తీర ప్రాంత రైతుల గోస వర్ణనాతీతంగా మారింది. కోటపల్లి, చెన్నూరు, జైపూర్ మండలాల్లో పత్తి చేన్లు, వరి పొలాలు నీట మునుగుతున్నాయి. మొదట అతివృష్టి కారణంగా వరదలు వస్తున్నాయని అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు చెప్పి తప్పించుకున్నారు. వరుసగా నాలుగేళ్లు అదే తీరుగా వరదలతో నష్టాలు ఉండడంతో బ్యారేజీలతో నష్టమేనని స్పష్టమైంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల బ్యాక్‌వాటర్ ప్రభావంతో తీర ప్రాంతాల్లో పంటలు వేయాలన్నా రైతులు జంకుతున్నారు. ఇటీవల చెన్నూరుకు వచ్చిన మంత్రి హరీశ్‌రావు, మందమర్రిలో ఎన్నికల ప్రచార సభకు వచ్చిన సీఎం కేసీఆర్ దృష్టికి ముంపు సమస్యను ఎమ్మెల్యే సుమన్ తీసుకెళ్లారు. తమను మళ్లీ గెలిపిస్తే నదీ తీర ప్రాంత రైతులకు నష్టం జరగకుండా చూస్తామని హామీలు ఇచ్చారు. దీంతో ఇన్నాళ్లు గుర్తుకురాని ముంపు రైతులు ఎన్నికల్లో ఓట్ల కోసమే గుర్తుకు వచ్చామా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముంపునకు గురవుతున్న రైతుల ఓట్లు ఎటువైపు పడుతాయనే చర్చ నడుస్తోంది.

నాలుగేళ్లుగా నష్టపోతున్న..



మూడున్నర ఎకరాల్లో పత్తి వేస్తాను. కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో గత నాలుగు సంవత్సరాలుగా పంట మునిగిపోయి తీవ్రంగా నష్టంగా పోయిన. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి పైసా పరిహారం రాలేదు. ఎమ్మెల్యే బాల్క సుమన్ కనీసం పంటలను పరిశీలించిన దాఖలాలు లేవు.

– సుంకరి మల్లయ్య, ముంపు బాధిత రైతు, గ్రామం: రాపన్‌పల్లి, మం: కోటపల్లి

ఏటా మునుగుడే



ప్రతియేటా వర్షాకాలంలో బ్యాక్‌వాట ర్‌తో పంటలు నీట మునుగుతున్నా యి. దీంతో నష్టపోతున్నాం. పంటలు నీట మునగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– బాల్నే నరేష్‌రెడ్డి, గ్రామం: వెంకంపేట, మం: చెన్నూరు

పది ఎకరాల్లో మునక



కాళేశ్వరం బ్యాక్‌వాటర్‌తో పది ఎకరాల్లో పత్తి నీట మునుగుతోంది. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. పరిహారం అందక ఇబ్బందులు పడుతున్నాం.

– రామ్‌టెకి వీరయ్య, గ్రామం: అలుగామ, మం: కోటపల్లి

పోలింగ్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్ దత్తా

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల నిర్వహణ, ప్రవర్తన నియమావళిపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్ దత్తా అన్నారు. శనివారం స్థానిక డిగ్రీ కళాశాలలో మంచిర్యాల నియోజకవర్గ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమానికి మంచిర్యాల రిటర్నింగ్ అధికారి రాములుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు హ్యాండ్‌బుక్‌పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పోలింగ్ రోజు ఈవీఎం విషయంలో ఇబ్బంది తలెత్తినట్లయితే వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల పనితీరు, పోలింగ్ ప్రక్రియకు సంబంధించి ఫారం నింపే విధానంపై అవగాహన కల్పించారు.




నెన్నెల: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బిశ్వజిత్

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నెన్నెల: మండలంలోని నెన్నెల, జంగాల్‌పేట, ఖర్జీ, ఆవుడం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్‌దత్తా శనివారం పరిశీలించారు. మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. విద్యుత్, ఫర్నిచర్, మంచినీటి వసతి, మూత్రశాలలు, దివ్యాంగుల కోసం ర్యాంపులను పరిశీలించారు. గ్రామాల్లోని ఓటర్లకు పోలింగ్ చిట్టీలను అందజేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. లైజెన్ ఆఫీసర్ దినేష్, బెల్లంపల్లి రూరల్ సీఐ రాజ్‌కుమార్, ఎస్సై శ్యాంపటేల్, ఎంపీడీఓ వరలక్ష్మి, ఆర్ఐ గణేష్, కార్యదర్శులు సాగర్, సతీష్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో ప్రశాంతతకు సహకరించాలి



మాట్లాడుతున్న డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్

మందమర్రిరూరల్: ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య అన్నారు. శనివారం మందమర్రి పట్టణంలో పోలీసు సిబ్బంది, ప్రత్యేక బలగాలతో భారీ పోలీస్ కవాతు నిర్వహించారు. సీఐఎస్‌ఎఫ్ క్యాంపు వద్ద ప్రారంభమైన ర్యాలీ పుర వీధుల గుండా మార్కెట్ సెంటర్‌కు చేరింది. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద సుమారు మూడు వేల మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. మందమర్రి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, మందమర్రి ఎస్సై చంద్రకుమార్ పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని ప్రధాన రహదారులు, మార్కెట్ ఏరియాలో పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఓటర్లలో చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ రాజు, ఎస్సైలు రాజేందర్, జగదీష్, మహేందర్ ప్రత్యేక బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి: పట్టణంలో పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. పాత బస్టాండ్ సింగరేణి తిలక్‌స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారి మీదుగా రైల్వేస్టేషన్ వరకు కొనసాగింది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్, బెల్లంపల్లి రూరల్ సీఐ ఎస్.రాజ్‌కుమార్‌గౌడ్, సీఆర్‌పీఎఫ్ అధికారులు, ఎస్సైలు, జవాన్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలి

• జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

చెన్నూర్: రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మోతిలాల్ అన్నారు. శనివారం చెన్నూర్ పట్టణ ప్రధాన వీదుల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఓటు ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు అనే వజ్రాయుధంతో సుపరిపాలన అందించే నాయకున్ని ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

బెల్లంపల్లి: పట్టణంలోని టేకులబస్తీ ప్రాంతంలో శనివారం నిర్వహించిన తనిఖీల్లో మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. టేకుల బస్తీ ప్రాంతంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా తాండూర్ మండలం బోయపల్లి గ్రామానికి చెందిన పుర్ర తిరుపతి వద్ద ఉన్న సంచిని తనిఖీ చేయగా అందులో మద్యం బాటిళ్లు లభించాయి. ఆఫీసర్స్ చాయిస్ 180 ఎంఎల్ బాటిళ్లు 20, 90 ఎంఎల్ బాటిళ్లు 20, ఐబీ 180 ఎంఎల్ బాటిళ్లు 10, డెక్కన్‌బ్లూ 180 ఎంఎల్ బాటిళ్లు 20 ఉన్నట్లు గుర్తించారు. వాటి విలువ రూ.12,290 వరకు ఉంటుందని ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. నిందితుడు తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'సెలవు దినాల్లో విధులకు హాజరు కావాలి'




వాట్సాప్ గ్రూపులో పెట్టిన మెసేజ్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిపై వేధింపులు ఆగడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినాల్లో సైతం ఉద్యోగులంతా విధులకు హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ హుకూం జారీ చేయడం చర్చనీయాంశమైంది. ఈ నెల 26న ఆదివారం, 27న గురునానక్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఆయా రోజుల్లో ఉద్యోగులంతా తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని సిబ్బంది ద్వారా కమిషనర్ మున్సిపల్ బెల్లంపల్లి స్టాఫ్ వాట్సాప్ గ్రూపులో మెసేజ్ పెట్టించడంతో సహచర ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కమిషనర్ ఎన్నికల ప్రచార లెక్కల వ్యవహారంలో అవకతవకలకు పాల్పడి అడ్డంగా దొరికి పోవడంతో ఉద్యోగుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ప్రలోభాలతో ఎర!?

• ప్రచారం ముగియక ముందే డబ్బు, మద్యం పంపిణీ షురూ..
• ఫిరాయింపులతో మైండ్‌గేమ్ ఆడుతున్న మరో అభ్యర్థి
• ఎన్నికల నిబంధనలు బేఖాతర్

జంగ్ తెలంగాణ



బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించడానికి పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రలోభాలకు తెరలేపారు. ఇరువురు అభ్యర్థులు నువ్వా.. నేనా అనే రీతిలో పోటీ పడుతున్నారు. పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో ఓటర్లను మచ్చిక చేసుకునే చర్యలకు దిగుతున్నారు. ఎలాగైనా సరే ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి ఓట్లు దండుకోవాలనే యోచనతో ముందుకు సాగుతున్నారు. పక్కా వ్యూహంతో ముఖ్యనాయకులు, కార్యకర్తలను పురమాయించి డబ్బు, మందు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ప్రచారానికి వెళ్లిన సందర్భంలో సమస్యలు పరిష్కరించలేదని ఓటర్లు బాహాటంగానే నిలదీసి నిరసనలు చేస్తుండటంతో సదరు అభ్యర్థి డబ్బుల పంపిణీ కార్యక్రమాన్ని నమ్ముకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యూహంలో మరో కిటుకు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి అభ్యర్థి ప్రచారం చేస్తున్న క్రమంలోనే ఓటర్లకు ముందస్తుగా తన డబ్బులు పంపిణీ చేయించి ఆతర్వాత ప్రత్యర్థి పంచేక్రమంలో కట్టడి చేయాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. మరో ముఖ్యమైన అభ్యర్థి రోజువారీగా ప్రచారాన్ని సాగిస్తూనే ప్రత్యర్థి పార్టీల ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో బేరసారాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా డబ్బుల ఎర జూపి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత కాంట్రాక్టులు ఇస్తానని అభ్యర్థులు భరోసా ఇస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇరువురు అభ్యర్థులు ఎందులోనూ తగ్గకుండా పోటాపోటీగా వ్యవహరిస్తుండటంతో ఎన్నికల నిబంధనలు బేఖాతర్ అవుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఓటుకు నోటు తప్పని ఎన్నికల అధికారులు ప్రచారం చేయడం తప్ప గుట్టుగా జరుగుతున్న ఆ తంతును నివారించి, సంబంధిత అభ్యర్థులపై చర్యలు తీసుకోవడం లేదనే అపవాదును మూటగట్టుకుంటున్నారు.

ఓటుకు రూ.2 వేలు?

ఈసారి ఎన్నికల్లో ఓటు విలువ పెరిగినట్లుగా తెలుస్తోంది. గత ఎన్నికల వరకు రూ.వంద నుంచి రూ.వెయ్యి వరకు ఉన్న ఓటు విలువ ఈదఫా అమాంతం పెరిగినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం డబ్బుల పంపిణీ కార్యక్రమానికి తెర లేపిన అభ్యర్థి తన అనుయాయులతో ఒక్కో ఓటుకు గరిష్ఠంగా రూ.2 వేల చొప్పున పంపిణీ చేయిస్తునట్లు వినికిడి. ఎన్నికల్లో గెలిచాక సమస్యలు పట్టించుకోని అభ్యర్థుల నుంచి అందిన కాడికి దండుకోవడమే నయమనే రీతిలో ఓటర్లు ఉన్నట్లు తెలుస్తోంది. డబ్బులతోనే సరిపెట్టకుండా ఒక్కో ఓటరుకు క్వార్టర్ మద్యం బాటిల్‌ను అదనంగా అందజేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

చేరికల జోరు పెంచి ప్రత్యర్థితో మైండ్ గేమ్

ఎన్నికల బరిలో నిలిచిన ఓ ముఖ్యమైన అభ్యర్థి తన ప్రత్యర్థికి ముచ్చెమటలు పోయిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి నాయకులను లక్ష్యంగా చేసుకుని బేరసారాలు చేస్తున్నారు. దీంతో కొద్దిగంటల వరకు ప్రత్యర్థితో కలిసి ప్రచారంలో పాల్గొన్న నాయకులు ముఖ్య అభ్యర్థి ఆకర్షణలకు లొంగి కండువా మార్చుకుంటున్నారు. వేమనపల్లి, నెన్నెల, కాసిపేట, తాండూర్, కన్నెపల్లి, భీమిని, బెల్లంపల్లి మున్సిపాలిటీతో పాటు గ్రామీణ ప్రాంతం నుంచి ఒక్కసారిగా వలసలు పెరిగాయి. ఒక్కో నాయకుడి స్థాయిని బట్టి రూ.లక్షల్లో బేరం కుదుర్చుకుని అడ్వాన్స్ చెల్లిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్య అభ్యర్థి ఆడుతున్న మైండ్ గేమ్‌తో ప్రత్యర్థి తల పట్టుకుంటున్నాడు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఓ అభ్యర్థి ఏజెంట్లు డీల్ కుదిరాక డబ్బులు ముట్టజెప్తుండడం సాధారణ తంతుగా మారింది.

పోలింగ్ ఏజెంట్లు కీలకం

• ఓటింగ్ సరళి పరిశీలనలో వారిదే ముఖ్యపాత్ర

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎన్నికల రోజున పోలింగ్ బూత్‌లలో అభ్యర్థుల తరఫున పరిశీలన కోసం కూర్చునే ఏజెంట్ల పాత్ర చాలా కీలకమైంది. పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లేందుకు ఎన్నికల సిబ్బందితో పాటు అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లకు మాత్రమే అవకాశం ఉంటుంది. ఏజెంట్లు లోపలికి, బయటకు వెళ్లాలంటే ప్రిసైడింగ్ అధికారి అనుమతి తీసుకోవాలి. పోలింగ్ ప్రారంభానికి కనీసం అరగంట ముందు రావాల్సి ఉంటుంది. బోగస్ ఓట్లు పడకుండా చూడాల్సిన బాధ్యత ఏజెంట్లపై ఉంటుంది. ఒక్క ఓటు తేడా వచ్చినా అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశం ఉంది. దీంతో ఆయా పార్టీల నుంచి ఏజెంట్లుగా ఉండే వారు అభ్యర్థులకు అత్యంత విశ్వాసపాత్రులుగా ఉండాలి. వీరి నియామకంలో ఎన్నికల సంఘం ఇటీవల కొన్ని మార్పులు చేసింది. పోలింగ్ స్టేషన్‌లో గుర్తింపు పొందిన జాతీయ పార్టీలు, రాష్ట్ర పార్టీలు, ఇతర రాష్ట్రాల పార్టీలు తమ ఎన్నికల గుర్తును ఇక్కడ ఉపయోగించడానికి అనుమతి పొందినవారు, గుర్తింపు పొందని రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో ఆయా పోలింగ్ కేంద్రంలో ఏజెంట్లకు కుర్చీలు వేస్తారు. ఏజెంట్లు తప్పనిసరిగా అదే గ్రామానికి, పట్టణాల్లో అయితే వార్డు, వార్డులోని బ్లాక్‌లకు చెందినవారై ఉండాలి. ఆ ఏజెంట్ ఓటరుగా నమోదై ఫొటో గుర్తింపు కార్డు విధిగా కలిగి ఉండాలి. ప్రతీ పోలింగ్ స్టేషన్‌కు అభ్యర్థి తరఫున ఒక పోలింగ్ ఏజెంట్, ఇద్దరు రిలీవ్ ఏజెంట్లను నియమించుకోవచ్చు. ఏజెంట్లు మొబైల్ ఫోన్, తదితర సమాచార వ్యవస్థకు సంబంధించి పరికరాలు పోలింగ్ కేంద్రంలో వినియోగించరాదు. పార్టీ కండువాలు, గుర్తులను ధరించరాదు. ఓట్లు వేయమని, ఆ ఓటర్ వరస సంఖ్యను సూచించి వెలుపలికి చీటీలను పంపడం కూడా చేయడం నిషేధం. ఎన్నికలు ముగిసిన తర్వాత ఈవీఎం, బ్యాలెట్ బాక్సులకు సీల్ వేసి భద్రపరిచే వరకు ఎన్నికల అధికారులకు సహకరించాలి.

ఇతర ప్రాంతాల్లోని ఓటర్లపై దృష్టి

• ఉన్నత చదువులు, ఉపాధికోసం వెళ్లిన వారి వివరాలు సేకరణ
• పోలింగ్‌కు రప్పించే ప్రయత్నంలో అభ్యర్థులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మరో మూడు రోజుల్లో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అన్ని పార్టీలు కూడా ఇతర పాంతాల్లో ఉంటున్న ఓటర్లపై దృష్టి సారించాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ముఖ్యంగా ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. ఈ క్రమంలో గెలుపు కోసం ఎలాంటి అవకాశాలు వదలకుండా ఓట్లు రాబట్టుకునే ఏర్పాట్లలో మునిగిపోయారు. సొంత ఊర్ల నుంచి బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారితో పాటు ఉన్నత చదువుకోసం పట్టణ, నగర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్ల వివరాలు ఆరా తీస్తున్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల్లోని పట్టణ, మండల, గ్రామాల్లోని ఓటర్లు హైదరాబాద్, వరంగల్, కరీంనగర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో చదువులు, ఉపాధి, కొలువుల నిమిత్తం వెళ్లిన వారు ఉన్నారు. వీరందరి ఓట్లు కూడా వారి వారి సొంతూళ్లలో ఉండగా పోలింగ్ రోజున వీరి ఓట్లు రాబట్టుకునేందుకు పార్టీ అభ్యర్థులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. పోలింగ్ రోజు ఓటు వేసేందుకు వారిని రప్పించేందుకు కొంతమందికి ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించారు. వారితో నేరుగా ఫోన్లలో సంప్రదింపులు ప్రారంభించారు. వారు వచ్చేందుకు అయ్యే ఖర్చులను తామే భరిస్తామని ప్రధాన పార్టీల అభ్యర్థులు హామీ ఇస్తున్నారు. ఇందులో భాగంగా ఒక్కో ఓటుకు రూ.రెండు నుంచి రూ.ఐదు వేల వరకు ఇస్తామంటుండగా మరోవైపు కానుకలు కూడా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నట్లు సమాచారం.

నిఘా నీడలో పోలింగ్ కేంద్రాలు

• పూర్తయిన జియో ట్యాగింగ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ రోజున ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఓటరు స్లిప్పులు, గుర్తింపు కార్డుల పంపిణీ తుదిదశకు చేరుకుంది. లాంగిట్యూడ్, లాటిట్యూడ్ ప్రక్రియ పూర్తి చేసి పోలింగ్ కేంద్రాలను జియో ట్యాగింగ్ పరిధిలోకి తీసుకువచ్చారు. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఫొటోలు తీసి జియోట్యాగింగ్ చేపట్టారు. దీని ద్వారా పోలింగ్ స్టేషన్ నుంచే పోలింగ్ సరళిని పూర్తిగా పరిశీలించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పోలింగ్ స్టేషన్ ఆవరణలో గొడవలు, అల్లర్లు జరిగితే రాష్ట్ర, జిల్లా స్థాయిలో తక్షణమే గుర్తించి సమస్యను సులువుగా పరిష్కరించే అవకాశం ఉంటుంది. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని 743 పోలింగ్ కేంద్రాల్లో జియో ట్యాగింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. పోలీసులు జిల్లాలోని సున్నితమైన, అతి సున్నితమైన ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా పూర్తి చేసేలా ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేశారు. మొత్తంగా అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్, లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మున్సిపల్ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గెర్రెకాలనీ వాసులు

చెన్నూర్: గెర్రెకాలనీలో తాగునీటి కష్టాలు తీర్చాలని శనివారం కాలనీ మహిళలు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ కాలనీలో రెండు వందలకు పైగా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. వారం రోజులకోసారి వచ్చే మిషన్ భగీరథ నీరు ఎప్పుడు వస్తుందో తెలియడంలేదన్నారు. కాలనీలో ఉన్న రెండు బోర్లు చెడిపోయాయని, ఉన్న ఒక్క బోరు నీరు మురికిగా వస్తున్నాయన్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నూర్ మున్సిపాలిటీలో గెర్రెకాలనీ లేదా అని ప్రశ్నించారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని, లేనిపక్షంలో ఓటింగ్‌కు దూరంగా ఉంటామన్నారు. నిరసనలో కాలనీ వాసులు పిట్టల రవీందర్, సమాచార హక్కు చట్టం నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల రవికుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

• మెరికల్లాంటి అభ్యర్థులను అందిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల
• ఏటా 50 మందికి శిక్షణ
• 100 మందికి పోలీస్, ఆర్మీలో ఉద్యోగాలు
• నేడు ఎన్‌సీసీ దినోత్సవం



ఆగస్టు 15న జరిగిన పరేడ్‌లో పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు (ఫైల్)

మంచిర్యాలక్రైం: దేశవ్యాప్తంగా క్రమశిక్షణకు చిరునామాగా పిలువబడుతున్న ఎన్‌సీసీ (నేషనల్ క్యాడెట్స్ కార్ప్స్) అనేది యువ అభివృద్ధి ఉద్యమం. యువతకు కర్తవ్యం, నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణ, నైతిక విలువలతో వారి సర్వతోముఖాభివృద్ధికి అవకాశాలు అందిస్తున్న సంస్థ. ఇది స్వచ్ఛంద ప్రాతిపదికన పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు విద్యార్థిదశ నుంచే నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవలు, సాహసాలపై శిక్షణ అందిస్తోంది. ఎన్‌సీసీ ప్రోగ్రామ్స్ విద్యా కార్యకలాపాల్లో భాగమైంది. ఇది మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1984లో ఎన్‌సీసీ 32(ఏ)బీఎన్ ఆదిలాబాద్ యూనిట్ బెటాలియన్‌గా ప్రారంభమైంది. ఇందులో శిక్షణ పొందిన కేడెట్లు ఆర్మీ, నేవి, పోలీస్, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్‌లో సుమారు వంద మంది ఉద్యోగాల్లో చేరారు. ఏటా 30 నుంచి 50 మందిని ఎంపికచేసి శిక్షణ అందిస్తున్నారు. నేడు ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా కథనం.

ఎన్‌సీసీ ముఖ్య ఉద్దేశం...

1948 జూలై 16న ఐక్యత క్రమశిక్షణ అనే నినాదంతో ఎన్‌సీసీ ఉనికిలోకి వచ్చింది. ఇందులో శిక్షణ పొందిన విద్యార్థులకు ఏ,బీ,సీ సర్టిఫికెట్స్ అందజేస్తారు. శిక్షణ కాలంలో వివిధ రాష్ట్రాలు, జిల్లాల్లో క్యాంపులు నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి ర్యాంకులు అందజేస్తారు. ఆర్‌డీసీ(రిపబ్లిక్ డే క్యాంపు)క్యాంపులు నిర్వహిస్తారు. ఇందులో ప్రతి సంవత్సరం జనవరి 26న ఢిల్లీలో జరిగే పరేడ్‌కు ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులకు డ్రిల్, లైన్‌ఫ్లాగ్ ఏరియా, కల్చరల్ ప్రోగ్రాం, బెస్ట్ క్యాడేట్ పోటీలు ఉంటాయి. ఇందులో వివిధ రాష్ట్రాలకు చెందినవారు పాల్గొంటారు. కార్యక్రమానికి రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేబినెట్ మంత్రులు, ఢిల్లీ ముఖ్యమంత్రి, త్రివిధ దళాధిపతులు హాజరవుతారు.

ఎంపిక పరీక్ష

ఎన్‌సీసీలో చేరాలంటే విద్యార్థులు ఎత్తు, ఛాతి, ఇతర భౌతిక అర్హతలు కలిగి ఉండాలి. పచ్చబొట్టు, జుట్టు తదితర వివరాలను పరిగణలోకి తీసుకుంటారు. శారీరక పరీక్షలు ముగిసిన తర్వాత రన్నింగ్, సామర్థ్యం పరీక్షలు ఉంటాయి. ఇందులో ఎంపికైన వారికి ఎన్‌సీసీలో చాన్స్ ఉంటుంది.

ఉత్సాహం చూపిస్తున్నారు



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరిన విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి పెరుగుతుంది. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న వారు సీఐఎస్ఎఫ్, ఆర్మీ, పోలీస్ ఉద్యోగాలు సాధించారు. ఇటీవల నిర్వహించిన ఆర్‌డీసీ క్యాంప్ సెలక్షన్స్‌లో కళాశాల నుంచి ముగ్గురు ఎంపిక కావడం గర్వంగా ఉంది.

– బీ.తిరుపతి, ఎన్‌సీసీ అధికారి, మంచిర్యాల

దేశ రక్షణకోసం ఆర్మీలో చేరుతా...



మొదట ఎన్‌సీసీ అంటే తెలియదు. ఎన్‌సీసీలో చేరిన తర్వాత వివిధ క్యాంపులు చేయడంతో దేశ రక్షణకోసం ఆర్మీలో చేరాలనిపించింది. ఎన్‌సీసీలో శిక్షణ తీసుకుంటే ఆర్మీ, పోలీస్, డిఫెన్స్ శాఖలలో ఉద్యోగాలు సులువుగా సాధించవచ్చు. గన్ ఫైరింగ్, పరేడ్, ఫిజికల్ ట్రైనింగ్ పోలీస్ ఉద్యోగాలకు ఎంతగానో ఉపయోగపడుతాయి.

– అనిల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాల

సీఎంపీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

• సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు సభ్యుడు కే.లక్ష్మారెడ్డి



లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు సంబంధించిన సీఎంపీఎఫ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు సభ్యుడు కే.లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాదులోని ఆ శాఖ కార్యాలయాన్ని సందర్శించి సమస్యలపై అధికారులతో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న క్లైమ్‌లను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఇంటి నిర్మాణ కోసం రుణం, ఉద్యోగుల పిల్లలకు ఉన్నత చదువులకు సంబంధించిన రుణాల కోసం దరఖాస్తు చేసిన క్లైమ్‌లను వెంటనే పరిష్కరించాలన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్‌లను జాప్యం చేయకుండా సత్వరమే ఇవ్వాలన్నారు. అనంతరం ఆ శాఖ అధికారులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి మండ రమాకాంత్, పెన్షనర్ అసోసియేషన్ కార్యదర్శి చెప్పు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మొన్న కాంగ్రెస్.. నిన్న బీఆర్‌ఎస్



శుక్రవారం కాంగ్రెస్‌లో చేరుతున్న రాజయ్య



శనివారం బీఆర్‌ఎస్‌లో చేరుతున్న రాజయ్య

భీమిని: బెల్లంపల్లి నియోజకవర్గంలోని కన్నెపల్లి మాజీ సర్పంచ్ పుల్లూరి రాజయ్య, సురేఖ దంపతులు శుక్రవారం గడ్డం వినోద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు. దీంతో పూటకో పార్టీ మార్చడంతో ప్రజల్లో ఏ పార్టీకి ఓటు వేయాలనే సందిగ్ధం నెలకొంది.

'బీజేపీ, బీఆర్‌ఎస్‌ను ఓడించండి'

పాతమంచిర్యాల: ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సమస్యలు సమస్యలు పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతూ అరాచకాలు సృష్టిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు సుమలత, వజ్రక్క, సువర్ణ, సుశీల, మల్లేశ్వరి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రూ.2.50 లక్షల నగదు పట్టివేత

జైనథ్: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ చెక్‌పోస్ట్ వద్ద కారులో తరలిస్తున్న రూ.2.50లక్షల నగదును సీజ్ చేసినట్లు వన్ టౌన్ ఎస్సై నారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... ఒడిశాకు చెందిన బసంత మహారాణ తన కారులో తమిళనాడు వైపు వెళ్తున్నాడు. చెక్‌పోస్ట్ వద్ద అతడి వాహనాన్ని తనిఖీ చేయగా రూ.2.50 లక్షల నగదు లభించింది. ఈ నగదుకు సంబంధించిన ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో సీజ్ చేసి, అతడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపాడు.

గూడెంలో కొనసాగుతున్న రద్దీ

• వేలాదిగా తరలివస్తున్న భక్తులు
• 509 జంటల సామూహిక సత్యనారాయణ వ్రతాలు



మండపంలో భక్తుల సత్యనారాయణ వ్రతాలు

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో భక్తుల కార్తీక పూజలు కొనసాగుతూనే ఉన్నాయి. కార్తీక త్రయోదశి సందర్భంగా శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. 509 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు.

కార్తీక జాతరకు ఏర్పాట్లు ముమ్మరం

రెండో అన్నవరంగా ప్రసిద్ధి గాంచిన దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం జరిగే కార్తీక పౌర్ణమి జాతరకు శనివారం ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జాతరకు సుమారుగా లక్షవరకు భక్తులు వస్తారని అంచనాకు తగ్గట్లు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.

ఏరియా ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ ప్రారంభం



పునఃప్రారంభిస్తున్న జీఎం రవిప్రసాద్

బెల్లంపల్లి: రెండున్నర ఏళ్ల క్రితం తాత్కాలికంగా మూసివేతకు గురైన బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్, మెటర్నిటీ వార్డుల తలుపులు ఎట్టకేలకు శనివారం తెరుచుకున్నాయి. బెల్లంపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ డి.రవిప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ థియేటర్, మెటర్నిటీ వార్డుల పునఃప్రారంభంతో కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి డీవైసీఎంవో శౌరి, గైనకాలజిస్ట్ అరుణజ్యోతి, వైద్యులు శ్రీదేవి, మ్యాట్రిన్ విజయలక్ష్మి, కార్మిక సంఘాల నాయకులు డీఆర్ శ్రీధర్, సోకాల శ్రీనివాస్, రసరంజని, తదితరులు పాల్గొన్నారు.